www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 4 ఆగస్టు 2025

5

ఏలూరు



ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే నీట్ పీజీ 2025 పరీక్ష ఏలూరులో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఏలూరులో రెండు కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 373 మందికి 343 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. ఇందులో సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 200 మందికి 181 మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరయ్యారు. అలాగే సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 173 మందికి 162 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 12:30 గంటల వరకూ పరీక్ష నిర్వహించగా ఉదయం ఏడు గంటల నుంచి 8:30 గంటల వరకూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. అడ్మిట్ కార్డ్, రెండు ఫొటోగ్రాఫ్‌లు, పెన్ను మినహా వాటర్ బాటిల్ కూడా లోపలికి అనుమతించలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

జిల్లా పరిషత్ ఆస్తులకు.. రక్షణ కరువు..!



జిల్లా పరిషత్ కార్యాలయం భవనం

ఏళ్లనాటి చెట్లు కొట్టేసి నిబంధనలకు విరుద్ధంగా స్థలం లీజుకిచ్చే వ్యూహం

చెట్ల పెంపకంపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చర్యలు.. ఇక్కడ నరికివేత

సెక్షన్ల ఆధునికీకరణకు రూ. 90.15 కోట్లు మంజూరు

ఎసిలతో సహా ఇప్పటికీ ఏ ఒక్కటీ ఏర్పాటు చేయని పరిస్థితి..

జెడ్‌పి ఆవరణలోని షాపుల అద్దెల వసూళ్లపై ఆరోపణలు

ఉద్యోగుల సంఘం భవనం కమర్షియల్‌కు ఇచ్చినట్లు ఫిర్యాదులు రావడంతో రద్దు

50 శాతం ప్రాతిపదికన మళ్లీ నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చేందుకు ప్రణాళిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధుల అత్యాశ, అధికారులు అధికార దుర్వినియోగం జిల్లా పరిషత్‌కు పెనుశాపంగా మారిందన్న చర్చ సర్వత్రా సాగుతోంది. ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. జిల్లా పరిషత్ ఆవరణలో ప్రధాన గేటు పక్కగా దశాబ్దాల కాలం నాటి చెట్లు ఉన్నాయి. పర్యావరణానికి పట్టుకొమ్మగా ఉన్న చెట్లపై పాలకుల కన్ను పడింది. ఈ చెట్లు నరికి అక్కడ స్థలాన్ని తమ అనుయాయులకు నిబంధనలకు విరుద్ధంగా లీజులకు ఇవ్వాలని ఆలోచన చేసినట్లు



నరికేసిన చెట్లు

తెలుస్తోంది. ఏళ్లనాటి చెట్లను తొలగించేందుకు ఆదివారం ప్రయత్నించగా మీడియాలో రావడంతో నిలిపివేశారు. ఎలాగైనా చెట్లను తొలగించాలన్న కుట్రతో అటవీశాఖ ద్వారా తమకు అనుకూలంగా అనుమతులు తెచ్చుకుని నిద్రమన్ను, మర్రిచెట్లతోపాటు, రెండు అశోక్ చెట్లను నరికివేశారు. అటవీశాఖా మంత్రి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చెట్లు పెంచాలంటూ పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. మరోపక్క అదే శాఖకు సంబంధించిన ఆవరణలోని దశాబ్దాల కాలంనాటి చెట్లను నరికివేసిన పరిస్థితి నెలకొంది. ఆ స్థలాన్ని దెందులూరుకు చెందిన ఓ నాయకుడికి లీజుకు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారుల నుంచి గానీ, ఇతర ప్రజా ప్రతినిధుల నుంచి గానీ సరైన స్పందన లేకుండా పోయింది. జెడ్‌పి ఆవరణలో షాపులు కట్టి వాటిని అద్దెకు ఇచ్చారు. వాటికి సంబంధించి అద్దెలు సక్రమంగా వసూలు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి వివరాలను అధికారులు సైతం బయటపెట్టడం లేదు. పాలకులకు అధికారులు ఏకపక్షంగా కొమ్ముకాస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

సెక్షన్ల ఆధునికీకరణ నిధులపైనా ఆరోపణలు..

జిల్లా పరిషత్ ప్రధాన కార్యాలయంలో సెక్షన్లను ఆధునికీకరించేందుకు 2024 జనవరిలో రూ. 90.50 లక్షలకు సంబంధించి పనులకు శంకుస్థాపన చేశారు. సెక్షన్ కార్యాలయాలకు తలుపులు పెట్టడం తప్ప ఇతర పనులు ఏవీ చేయలేదని తెలుస్తోంది. ఈ నిధులతో సెక్షన్ కార్యాయాలన్నింటిలోనూ ఎసిలు ఏర్పాటు చేయడంతోపాటు, ఇతర పనులు చేయాల్సి ఉన్నా జరగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికీ జెడ్‌పి ఉద్యోగులు ఉక్కపోతలోనే పనిచేస్తున్న పరిస్థితి నెలకొంది. రూ.90 లక్షల నిధులు దేనికి ఖర్చుచేశారో తెలియని పరిస్థితి. జిల్లా పరిషత్ సెక్షన్ల కార్యాలయాల్లో కంప్యూటర్లు సరిగ్గా పని చేయడం లేదు. పాతబడిపోయాయి. పనులు సకాలంలో చేయలేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్లను మాత్రం మార్చడం లేదు. జిల్లాకు తలమానికంగా ఉండే జిల్లా పరిషత్‌లో ఇటువంటి పరిస్థితి ఏర్పడడం అత్యంత దారుణమని చెప్పొచ్చు.

ఉద్యోగుల సంఘం భవనం వ్యవహారంలో దొంగాట

జెడ్‌పి ఆవరణలో నిర్మించిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ భవనం వ్యవహారంలో జిల్లా పరిషత్ పాలకులు, అధికారులు దొంగాట ఆడుతున్న పరిస్థితి నెలకొంది. ఉద్యోగుల సంఘానికి ఉచితంగా 125 గజాల స్థలం కేటాయించారు. ఉద్యోగ సంఘం అవసరాలకు తప్ప కమర్షియల్‌గా ఉపయోగించుకూడదనే నిబంధనలు ఉన్నాయి. ఆ స్థలంలో నిర్మించిన ఉద్యోగ సంఘం భవనంలో కింది ఫ్లోర్‌ను అద్దెకు ఇచ్చేందుకు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై మీడియాలో కథనాలు రావడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో జిల్లా పరిషత్ అధికారులు సదరు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు మళ్లీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు కొత్తగా మరో గూడు పుఠాణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా ఉద్యోగుల సంఘం భవనాన్ని కమర్షియల్‌కు ఇవ్వాలని పాలకులు, అధికారులు చూస్తున్నారు. వచ్చే అద్దెలో 50 శాతం జిల్లా పరిషత్‌కు, 50 శాతం ఉద్యోగ సంఘానికి చెందేలా కొత్తగా ఫైల్ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగుల సంఘం భవనం కమర్షియల్‌కు ఇవ్వకూడదని గతంలో కలెక్టర్లు జారీ చేసిన ఉత్తర్వులను తుంగలోతొక్కి జిల్లా పరిషత్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. జిల్లా పరిషత్ ఆస్తులను రక్షించాల్సిన పాలకులు, అధికారులే 'కంచే చేను మేసిన చందంగా' చేస్తున్న పనులు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. జిల్లా పరిషత్‌లో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం ఫోకస్ చేసుకుని విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు మరిన్ని బయటపడే పరిస్థితి ఉంటుంది. లేకపోతే జిల్లా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతం అవ్వడంతోపాటు, నిధులు సైతం దుర్వినియోగం అయ్యే పరిస్థితి నెలకొంది.

నేడు యథావిధిగా పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈ నెల నాలుగో తేదీ సోమవారం యథావిధిగా పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అందించిన https://meekosam.ap.gov.in వెబ్‌సైట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు నమోదు, స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

బిసి సంక్షేమ హాస్టళ్లలో తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని బిసి సంక్షేమ హాస్టళ్లను ఆదివారం రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సంచాలకులు డి.చంద్రశేఖరరాజు తనిఖీ చేశారు. ఏలూరులోని బిసి బాలికల హాస్టల్ 1, 2, కళాశాల హాస్టల్ 1, 2ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనాలు, రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అర్‌వి.నాగరాణి, సహాయ బిసి సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



హాస్టల్లో భోజనం వడ్డిస్తున్న చంద్రశేఖరరాజు

ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా శివాజీ, మనోజ్

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్ఎఫ్ఐ ఏలూరు సిటీ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎస్.శివాజీ, కార్యదర్శిగా బి.మనోజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.జయంతు వీరబాబు, సహాయ కార్యదర్శిగా ఎం.శివ, ఎల్.రాజేష్ మరో ఆరుగురు సిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో సిటీ కార్యదర్శి బి.మనోజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల హక్కులను కాలరాస్తుందన్నారు. ఈ జిఒ అమలైతే ప్రభుత్వ పాఠశాలల్లో ఏం జరుగుతుందో కూడా బయటకు తెలియదని, కార్పొరేట్ విద్యావ్యవస్థలో విద్యార్థులపై పెట్టే ఒత్తిడి కూడా బయటకు తెలియదని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా దోచుకోవడానికి మంత్రి నారా లోకేష్ అవకాశం ఇచ్చారన్నారు. ఈ జిఒలు వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఐక్యమై ఎంత దూరమైన వెళ్లడానికి సిద్ధమని చెప్పారు. నగర అధ్యక్షులు ఎస్.శివాజీ మాట్లాడుతూ పట్టణంలోని హాస్టళ్లలో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఎస్‌సి బాలుర హాస్టల్‌లో విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడ్డారన్నారు. సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, ఎస్‌డబ్ల్యూం ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అమీనాపేట బాలికల హాస్టల్‌కు ప్రహరీ గోడ సరిగా లేకపోవడం వల్ల ఆడపిల్లలకు రక్షణ కరువైందన్నారు. పాత జెడి కార్యాలయం వెనుక భాగంలో గోడ కూలిపోయి ఉందని, ఆ మార్గం నుంచి గతంలో యువకులు వచ్చారని, అప్పటి ఎఎస్‌డబ్ల్యూఒకు సమాచారం ఇచ్చామని, ఇప్పటివరకు ఆ ప్రహరీ పూర్తి చేయలేదని చెప్పారు. ఆ ప్రహరీ గోడను పూర్తిచేసి ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ఎం.జయంత్, వీరబాబు, సహాయ కార్యదర్శి శివ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



శివాజీ



మనోజ్

5న ధర్నాను జయప్రదం చేయాలి

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



టి.నరసారం : సంతకాలు సేకరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారం వేయొద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన ఏలూరు విద్యుత్ భవనం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్య కార్యచరణ వేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఐఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వేదిక నాయకులు పంపన రవికుమార్, బద్దా వెంకట్రావు, ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లకు ఒప్పందాలు చేసుకుని, అదానీ సంస్థకు టెండర్లు కట్టబెట్టి, భారీ కుంభకోణానికి పాల్పడిందన్నారు. అందుకే గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని, ఆనాడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి ప్రభుత్వం ఈనాడు అవే మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడం అంటే రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహం చేయడమే అవుతుందన్నారు. విద్యుత్ భారాలు తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ సంవత్సరంలో 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు ఛార్జీలను అదనంగా ప్రజలపై భారాలు వేశారని తెలిపారు. స్మార్ట్ మీటర్లను, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, పాత మీటర్లనే కొనసాగిస్తూ, పాత రీడింగ్ పద్ధతినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ విద్యుత్ భవనం వద్ద ప్రజా ధర్నా నిర్వహించడం జరుగుతుందనీ, ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

టి.నరసాపురం: మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా రాష్ట్రంలో బిగిస్తున్న అదానీ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతికించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లుల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపు తదితర సమస్యలపై వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు బిఎస్.సాగర్, సిపిఐ ఎంఎల్ జనశక్తి నాయకులు కారం భాస్కర్ మాట్లాడుతూ ఈ నెల ఐదో తేదీన జరిగే సబ్‌స్టేషన్ల ముట్టడి కార్యక్రమానికి మండలంలోని ప్రజలందరూ హాజరై విద్యుత్ ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనాలని



కలిదిండిలో..

పిలుపునిచ్చారు. ప్రభుత్వ మీటర్ ఉండగా తిరిగి స్మార్ట్ మీటర్లు బిగిస్తానని ఇళ్ల వద్దకు, దుకాణాల వద్దకు గానీ ఎవరైనా వస్తే కచ్చితంగా వ్యతిరేకించాలని, వినని పక్షంలో ఆ మీటర్లను బద్దలు కొట్టాలని ప్రజలకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో అనుమోలు మురళీ, మడకం కుమారి, కొండా రాము పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్ : స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ కుక్కునూరు మండలంలోని చీరవల్లి గ్రామంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం స్మార్ట్ మీటర్ల బాదుడుపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు నాయకులు ప్రజలకు వివరిస్తూ ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల సమితి కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి.నాగేంద్రరావు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు ఇళ్లకు



కుక్కునూరులో..

బిగించి వేలల్లో విద్యుత్ బిల్లుల భారం మోపి వినియోగదారులను ప్రభుత్వం గుల్ల చేస్తోందని తెలిపారు. స్మార్ట్ మీటర్ల వ్యవస్థను రద్దు చేయకపోతే ప్రభుత్వంపై ప్రజలే యుద్ధం చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో యర్నం.సాయికిరణ్, పి.రమేష్ పాల్గొన్నారు.

కలిదిండి : విద్యుత్‌ను ప్రయివేటుపరం చేసేలా అదానీ స్మార్ట్ మీటర్లు బిగించొద్దని కోరుతూ మండలంలోని భాస్కరరావుపేట, మూలలంక గ్రామాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కూటమి ప్రభుత్వం నేడు ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు అన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు బిగించొద్దని ఈ నెల 5వ తేదీన మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల నాయకులు వి.భాస్కరరావు, ఎస్.మహాలక్ష్మి, డివి.సత్యన్నారాయణ, జి.అనిల్ కుమార్, కె.రమేష్, సిహెచ్.సత్యన్నారాయణ, జోగి ఏసు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని చిన్న ఆగిరిపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏపూరి రవీంద్ర, ఎం.నరేష్, జె.రంగారావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య

ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరపున పోటీ పడేలా మహిళలు ఎదగాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య ఆకాంక్షించారు. స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంలోని వెయిట్ లిఫ్టింగ్ హాలులో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందని ఆలోచించిన ప్రధాని మోడీ క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఖేలో భారత్ పోటీలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని, ప్రధాని ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాలతో పాటు క్రీడారంగంలో కూడా మంచి స్థాయికి ఎదిగాలని, జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, క్రీడా స్ఫూర్తితో మంచి ప్రతిభ కనపరచాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బడేటి వెంకటరామయ్య, ఇడా ఛైర్మన్ పి.శివప్రసాద్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎం.పార్థసారథి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సుమారు 50 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన క్రీడాకారులకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ట్రూఅప్ పేరుతో ప్రజలపై భారాలు సరికాదు

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

5న ధర్నాల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, పైగా ట్రూడౌన్ పేరుతో ధరలు తగ్గిస్తామని ప్రకటించి నెల రోజులు కూడా కాకుండానే మళ్లీ ట్రూఅప్ పేరుతో ప్రజలపై మరో రూ.12,771 కోట్ల భారాన్ని మోపడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, తక్షణం దీనిని ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019-20 నుంచి 2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ రిటైల్ వ్యాపార లోటు పేరుతో రూ.12,771 కోట్లు ట్రూ అప్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ నియంత్రణా మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా ఇది జరగదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఛార్జీల పెంపుదలను నిలుపుదల చేయాలని, గత 36 నెలల నుంచి 2014-19 కాలానికి సంబంధించిన రూ.మూడు వేల కోట్లు ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 2022-23, 2023-24 సంవత్సరాల కాలానికి రూ.15,485 కోట్లు సర్దుబాటు ఛార్జీల భారం మోపారని, ఇదికాకుండా 2024-25 సంవత్సరానికి ప్రతినెలా యూనిట్‌కు 40 పైసల చొప్పున ఒక్క సంవత్సరంలోనే రూ.2,787 కోట్లు వసూలు చేశారని, స్మార్ట్ మీటర్ల వల్ల అదనపు భారాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం వేసిన విధంగా విద్యుత్ భారాలు వేయబోమని, తగ్గిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చి అధికారంలోకొచ్చాయని, కూటమి సర్కార్ మాట తప్పిందని, భారాలు మోపిందని, ప్రజలు వీటిపై ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇటీవల రూ.449 కోట్లు ట్రూ డౌన్ ద్వారా ఛార్జీలు తగ్గిస్తామని ప్రచారం చేశారని, మూడు డిస్కామ్ల పరిధిలో సగటున మిగులు ఉందని కూడా చూపెట్టారని, ఈ తరుణంలో మరో రూ.12,771 కోట్ల భారం మోపుతూ పంపిణీ సంస్థలు, విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపగా మండలి వాటిపై అభిప్రాయాలు తెలపాలని, జులై 30న నోటిఫికేషన్ ఇచ్చిందని, నిర్ణయించిన విద్యుత్ ఛార్జీలు చెల్లించిన ఐదేళ్ల తర్వాత ఆదాయ, వ్యయాల మధ్య లోటు పేరుతో ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేసే విధానమే అక్రమమని పేర్కొన్నారు. ఈ విధానాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వం, పంపిణీ సంస్థలు కార్పొరేట్ కంపెనీలతో అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో అడ్డగోలుగా వ్యయం పెంచి ఆ భారాన్ని వినియోగదారులపై వేయడం దుర్మార్గమని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా, ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల విధానం రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వద్దని ఆగస్టు 5న ప్రజావేదిక ఆధ్వర్యంలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ తరఫున ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం ఎన్‌ఆర్.హనుమాన్లు అధ్యక్షతన పట్టణ సిఐటియు ఐదో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రయివేటీకరణ ఆపాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రజలపై పన్నుల రూపంలో వేసే భారాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా మహాసభ నూజివీడు పట్టణంలో సెప్టెంబర్ 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో సిఐటియు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా జి.రాజు, 20 మంది కమిటీ సభ్యులు కె.జయలక్ష్మి, ఎల్.రంగారావు, దేవదాసు, నాగమణి, పరంజ్యోతి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

అవార్డులు పొందేందుకు దరఖాస్తుల స్వీకరణ : డిఇఒ


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల స్టేట్‌అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహించేందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో స్టేట్ అవార్డుకు అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వారి దరఖాస్తులను వారి వారి డివిజన్ పరిధి అధికారికి ఈ నెల ఎనిమిదో తేదీ లోపు అందించాలని తెలిపారు. ఈ అవార్డులకు కనీసం పదేళ్ల సేవా కాలం పూర్తి చేసిన టీచర్లు, హెడ్‌మాస్టర్లు, టీచర్ ఎడ్యుకేటర్లు అర్హులని, విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కృషి చేసి ఉండాలని, గతంలో రాష్ట్రస్థాయి అవార్డు పొందిన టీచర్లు, హెడ్‌మాస్టర్లు, టీచర్ ఎడ్యుకేటర్లు అనర్హులని, ఆరోపణలు, క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులు ఉన్న ఉపాధ్యాయులకు అర్హత లేదని తెలిపారు. నిర్ణీత సమయంలోగా స్టేట్ అవార్డుకు ప్రతిపాదనలను మీ సంబంధిత డివైఇఒ, ఎంఇఒ వారి కార్యాలయానికి అందించాలని కోరారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2026-27 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతికి ప్రవేశం కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 13వ తేదీ లోపు సమర్పించాలని, జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్ 5,828 దరఖాస్తులు అని, జులై 17 నాటికి ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులు 1003 మాత్రమే అని, జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యా శాఖాధికారులు వారి పరిధిలో మరింతమంది విద్యార్థులు జవహర్ నవోదయ పరీక్షకు ఆన్‌లైన్ చేయనునట్లు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.


పాస్టర్ మృతదేహానికి అంజలి ఘటిస్తున్న డాక్టర్ మనోజ్

మృతుని కుటుంబానికి అండగా వైష్ణవి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మృతుని కుటుంబానికి అంబుల వైష్ణవి అండగా నిలిచారు. మండలంలోని పెదకోమరు గ్రామానికి చెందిన పాస్టర్ చలపాక గిద్యోను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. గిద్యోను అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి వెంటనే స్పందించి తండ్రి డాక్టర్ మనోజ్ చేతుల మీదుగా రూ.ఐదు వేలు ఆర్థిక సాయం మృతుని కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం అందించారు. మృతి చెందిన వ్యక్తి కుమార్తె కూడా స్వల్ప అనారోగ్యంతో ఉండగా కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని డాక్టర్ మనోజ్ తెలిపారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

ఎపిటిఎఫ్-1938

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ఎపిటిఎఫ్-1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ గుగ్గులోతు కృష్ణ డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్-1938 జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక పవర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షులు ఇ.రామోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి చేసి బోధనకే పరిమితం చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని పరిష్కరించాలని కోరారు. అధికారంలోకొచ్చి తొలి అడుగు సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం ప్రభుత్వంలో భాగస్వాములైన ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించే సమయం సిఎం కేటాయించకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా, శాసనమండలి సాక్షిగా ఎత్తివేస్తామని ప్రకటించి సంవత్సరం అయినా సిఎం ఇచ్చిన వాగ్దానం నీటి మీద రాతలు లాగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, పిఆర్‌సి, ఐఆర్‌డిఎలపై సిఎం జెఎసి, ఉపాధ్యాయ సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం డాక్టరేట్ అందుకున్న గుగ్గులోతు కృష్ణను జిల్లా కార్యవర్గం ఘనంగా సత్కరించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మోహన్‌రావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్‌డివి.ప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌వి.దుర్గారావు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పూర్తికాని అదనపు తరగతి భవన నిర్మాణం

పాఠశాలలో సమస్యలు పరిష్కరించరూ..!

తిరుమలపురం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థుల ఆవేదన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తిరుమలపురం గ్రామంలో ఉన్న జెడ్‌పి హైస్కూల్‌లో సమస్యలను త్వరగా పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు నాయకులను, అధికారులను కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆడపిల్లల కోసం టాయిలెట్స్ నిర్మాణం చేపట్టారు. అవి పూర్తికాకపోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. టాయిలెట్స్ నిర్మాణ పనులను పట్టించుకునేవారే కరువయ్యారని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే అదనపు తరగతి కోసం చేపట్టిన భవన నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. అధికారులు, పాలకులు స్పందించి చివరి దశలో ఉన్న టాయిలెన్స్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, అదనపు తరగతి కోసం చేపట్టిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.



మొరాయించిన 108

మొరాయించిన 108 వాహనం

రోగుల అవస్థలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో ఉన్న 108 వాహనం జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వెళ్లి వస్తూ స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో మొరాయించింది. సిబ్బంది చేసేదేమి లేక వాహనన్ని అక్కడే నిలిపివేశారు. దీంతో మండలంలో ఎమర్జెన్సీ, జనరల్ కేసులు, గర్భిణులను ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లడం కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయం కోసం పక్కనే ఉన్న బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెంలో ఉన్న 108 వాహనాలను సంప్రదించినా అవి కూడా అందుబాటులో లేకపోవడంతో అత్యవసర రోగులు కూడా ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు 'మీకోసం'

ప్రజాశక్తి - ముసునూరు

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల నాలుగో తేదీ సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ డి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే మీకోసం కార్యక్రమంలో మండలంలోని రైతులు, ఎవరైనా పలువురు తమ సమస్యలను అర్జీ రూపంలో అందించవచ్చని చెప్పారు. ఆ సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేయగా ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,340 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని వారందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీలకు యాప్ కష్టాలు

వివరాలు అప్‌లోడ్ కావడం లేదంటున్న సిబ్బంది

లబ్ధిదారులకు రేషన్ ఇచ్చేందుకూ తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి



నెలకు రూ.లక్ష జీతం తీసుకుంటున్న వారు కూడా ఈ ఇబ్బందులు, టెన్షన్లు పడటం లేదు. అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ.11,500 వేతనం ఇస్తూ.. 24 గంటలు పని చేయిస్తున్నారని అంగన్వాడీ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలని కూడా చూడకుండా తమపై ఇంత పనిభారం పెంచడం న్యాయం కాదని వాపోతున్నారు. అంగన్‌వాడీ సిబ్బందిని యాప్ కష్టాలు వెంటాడుతున్నాయి.

ఇప్పటికే అమలుచేస్తున్న బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసి అందుబాటులోకి తెచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు రేషన్ సరకులను మరింత పకడ్బందీగా పంపిణీ చేసేందుకు వీలుగా ప్రభుత్వం యాప్‌లో మార్పులు చేసింది. అయితే మార్పులు చేసిన తరువాత యాప్ సరిగా పనిచేయడం లేదని, దీంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. అంగన్‌వాడీలకు పని భారాన్ని తగ్గించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలపై ఉంది.

మండలంలో 90 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అనేకచోట్ల యాప్ ఓపెన్ కావడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. కొన్నిచోట్ల యాప్ ఓపెన్ అయినప్పటికీ వివరాలు అప్‌లోడ్ కావడం లేదంటున్నారు. ప్రతిరోజూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఫొటోలు తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేసిన తరువాతే రేషన్ అందించాల్సి ఉంది. అయితే కొన్ని కారణాలతో ఒక్కోసారి లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రాలే కపోతున్నారని, అలాంటి సందర్భంలో వారికి సరకులు అందించడం కష్టమవుతోందని వాపోతున్నారు. అలాగే కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫొటో తీసే సమయంలో పిల్లలు కెమెరా వైపు చూడకపోతే వారి హాజరును యాప్ గుర్తించడం లేదంటున్నారు. ఉదాహరణకు ఒక కేంద్రంలో 30 మంది పిల్లలు హాజరైతే 15 నుంచి 20 మందిని మాత్రమే కౌంట్ చేస్తోందని, దీనివల్ల పిల్లలకు పూర్తిస్థాయిలో వండి వడ్డించలేని పరిస్థితి ఎదురవుతోందంటున్నారు. అంతేకాకుండా సిబ్బంది హాజరు కూడా ఇదే యాప్‌లో నమోదు చేయాలని, సమయానికి యాప్ ఓపెన్ కాకపోవడంతో కేంద్రానికి ఆలస్యంగా వచ్చినట్లు నమోదవుతోందని వాపోతున్నారు.

ఖర్చుల వివరాలూ యాప్‌లోనే

గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖర్చులకు సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసే అవకాశం ఉండేది. పిల్లలకు వండి వడ్డించేందుకు అయ్యే ఖర్చుకు సంబంధించిన ప్రతి రూపాయిని యాప్‌లోనే అప్‌లోడ్ చేయాలి. సాంకేతిక సమస్యలతో వివరాలు అప్‌లోడ్ కాకపోతే మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. పిల్లలు గుడ్లు తీసుకున్న ఫొటో తీసే సమయంలో కెమెరావైపు చూడకపోయినా వారి హాజరును లెక్కించడం లేదని, దీంతో రోజువారీ ఖర్చులపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో పిల్లాడికి రోజుకు 75 గ్రాముల బియ్యం ఇవ్వాలి. పది మంది పిల్లలుంటే 750 గ్రాముల బియ్యం వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కాని కొంతమంది పిల్లల హాజరు తీసుకోకపోవడంతో సమస్యలు వస్తున్నాయంటున్నారు. నెల ప్రారంభంలో ఓపెనింగ్ బ్యాలెన్స్ (గత నెలలో మిగిలిన గుడ్లు, ఇతర సరకులు) వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో అప్‌లోడ్ చేసిన సరకుల వివరాలకు రెట్టింపు చూపిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ చిక్కులన్నీ తమ పనితీరుపై ప్రభావం చూపిస్తున్నాయని, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు. అప్‌డేట్ చేసిన యాప్‌తో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించామని, వెంటనే పరిష్కార మార్గాలను సూచించాలని అంగన్వాడీల సిబ్బంది కోరుతున్నారు.

ఫేస్ యాప్ వల్ల తీవ్ర ఇబ్బందులు

బండి పద్మ,అంగన్వాడీ టీచర్, పెయ్యేరు



అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని యాప్‌ను, కేంద్ర ప్రభుత్వం పోషణ్ ట్రాకర్ యాప్‌లను నిర్వహించాల్సి వస్తుంది. బాల సంజీవని యాప్, పోషణ్ ట్రాకర్ యాప్‌లను ఒకటిగా చేయాలి. పోషణ్ ట్రాకర్ యాప్ నిర్వహణ అంగన్వాడీ లకు తలకు మించిన భారమైంది. ఈ యాప్ ఒకసారి ఓపెన్ అయితే ఒకసారి ఓపెన్ కావడం లేదు. దీనికోసం గంటల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తుంది. ఒకవేళ అయినా ఎంతసేపు ఉంటుందో అర్థం కాదు. ఈ యాప్ నిర్వహణ భారంతో బీపీలు, షుగర్లు వచ్చి అనారోగ్య పాలవుతున్నాం. పనికి తగిన వేతనం ఇవ్వాలి. తెలంగాణలో అంగన్వాడీలకు ఇస్తున్న రూ.రెండు లక్షల రిటైర్ మెంట్ బెనిఫిట్ స్కీం ఎపిలో కూడా అమలు చేయాలి.

ఈ యాప్‌లను ఒకటే యాప్‌గా చేయాలి

పి.సరస్వతి, అంగన్వాడీ టీచర్, ముదినేపల్లి



అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ఒకటే యాప్ ఉంటే సరిపోతుంది. పోషణ్ ట్రాకర్ యాప్ లో ఫేస్ క్యాప్చర్ అయితేనే ఫుడ్ ఇవ్వాల్సి వస్తుంది. ఈ ఫేస్ క్యాప్చర్ వల్ల లబ్ధిదారులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఒక నెల అయితే ఒక నెల కావటం లేదు. ఏ డిపార్ట్‌మెంట్‌లో లేని విధంగా ఐసిడిఎస్‌లో ఫేస్ క్యాప్చర్ విధానం నిర్వహించడం మంచి పద్ధతి కాదు. మారుమూల గ్రామం లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది సెల్ ఫోన్ల సిగ్నల్స్ అందక యాప్‌లో వివరాలు నమోదు చేయలేకపోతున్నాం. ప్రభుత్వం అందించిన సెల్ ఫోన్లు ఈ నెల నాలుగో తేదీన ఐసిడిఎస్ అధికారులకు అందిస్తాం. గ్యాస్, కూరగాయల ధరలు బిల్లులు పెంచాలి.

వికలాంగులకు నిత్యావసరాలు అందజేత


ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఏలూరుకు చెందిన ప్రముఖులు మామిళ్లపల్లి గంగరాజు, బడేటి శ్రీహరిరావు జ్ఞాపకార్థం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు గ్రామంలోని 60 మంది వికలాంగులకు నిత్యావసరాలు, పండ్లు, ఇతరాలను ఆదివారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హాజరయ్యారు. ఇతర దాతలతో కలిసి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, ఏలూరు ఎఎంసి ఛైర్మన్లు ఎస్ఎస్.గిరి, మామిళ్లపల్లి పార్థసారధి, భీమడోలు ఎఎంసి మాజీ ఛైర్మన్ దూసనపూడి పుల్లయ్య, భీమడోలు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు సిరి బత్తిన కొండబాబు హాజరయ్యారు.

కాపు సామాజిక భవనం నిర్మాణానికి సహకరిస్తా

ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

భీమడోలుకు చెందిన వంగవీటి మోహన రంగా కాపు సంఘ నాయకులతో పాటు, ఇతర కాపు ప్రముఖులు ఆదివారం భీమడోలులోని టిడిపి కార్యాలయంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులును కలిశారు. ఈ సందర్భంగా కాపు నాయకులు అసంపూర్ణ నిర్మాణంతో ఉన్న కాపు కమ్యూనిటీ హాలుతో పాటు, కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని ఆప్కాబ్ ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గన్ని వీరాంజనేయులు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


నిత్యావసరాలు అందిస్తున్న ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని

ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు



దెందులూరులో...

ప్రజాశక్తి - దెందులూరు

నగరంలోని ఆదివారపుపేటలో రక్షణ సైన్య సెంట్రల్ కోర్ చర్చిలో స్నేహితుల దినోత్సవ వేడుకలు గృహ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి కెప్టెన్ నీలా రత్నకుమార్ కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. గృహ సమితి ట్రెజరర్ లీనా ప్రశాంతి, కెప్టెన్ నీలా సుకన్యరాయ్‌లు స్వీట్లు పంచారు. అనంతరం దేవుని వాక్య పరిచర్యను అందించారు. 1907వ సంవత్సరంలో రక్షణ సైన్య వ్యవస్థాపకులైన జనరల్ విలియం బూత్, కోడలు ఫ్లోరెన్స్ బూత్ ఈ గృహసమితి ప్రారంభించారని, ఆరాధన, విద్య, సేవ, సహవాసం అనే నాలుగు విధానాలతో నేడు 134 దేశాలకుపైగా రక్షణ సైన్య స్త్రీల పరిచర్య ముందుకు కొనసాగుతోందన్నారు. ఇందులో ప్రధానంగా స్నేహ భావం ఎక్కువగా ఉంటుందన్నారు. సంఘంలో, కుటుంబంలో, సమాజంలో స్త్రీ స్నేహితురాలిలా ఒక ముఖ్యమైన భూమిక పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, గృహ సమితివారు, సంఘంలో ఉన్న విశ్వాసులు అందరూ తమ సహకారం అందించారు.

రోగులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ


ఏలూరులో...

ఏలూరు సిటీ : స్నేహితుల దినోత్సవం సందర్భంగా అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో రోగులకు ఆదివారం పండ్లు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య హాజరయ్యారు. ముందుగా అమ్మానాన్న ట్రస్ట్ సభ్యులు ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి, రోగులకు పండ్లు, దుప్పట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మారం అను ఇటువంటి సామాజిక కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. తాను ఒక్కడే చేయడమే కాకుండా తన స్నేహితులను సభ్యులుగా చేర్చుకుని ట్రస్ట్‌ను అభివృద్ధి చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాలు ముందు ముందు ఎన్నో చేయాలని, వారికి ఎల్లప్పుడూ సహకరిస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మారం జై సూర్య, అంబికా రఘు, దారం నాని, లాయర్ సురేష్, అందే జగదీష్, టానిక గంగాధరరావు, బండ్రెడ్డి వాసు, సేనాపతి నగేష్, గల్లా శ్రీను, విజయ వర్మ, గోక నెహ్రూ, గొన్నబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను వదలని సాగునీటి కష్టాలు

శివారు భూములకు పారని నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సాగునీటి కష్టాలు రైతులకు మళ్లీ మొదలయ్యాయి. ఇంకా మండల శివారు గ్రామాల్లోని భూములకు సాగునీరు పారలేదు. తుఫాన్ ప్రభావంతో గత వారం మండలంలో అడపాదడపా వర్షం కురిసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకను రైతులను నీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా వరినాట్లు చాలావరకు పూర్తి కావొచ్చాయి. అయితే శివారు గ్రామాల్లో గరువు భూములకు నీరు ఇంకా పూర్తిస్థాయిలో అందడం లేదు. ఈ కారణంతో వెదజల్లిన చేలులో పైరు ఎండిపోయే పరిస్థితులు కనబడుతున్నాయి. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షానికి చాలావరకు రైతులకు సాగునీటి కష్టాలు తొలగిపోగా, వారం రోజులుగా ఎండలు మండిపోవడంతో పలు ప్రాంతాల్లో ఇంకా నీటి కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో సాగునీటి కొరతతో రైతుల నాట్లు వేసుకునేందుకు, నాట్లు వేసిన పైరును కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిగురుకోట, చినకామనపూడి, పెదకామనపూడి, వడాలి, ముదినేపల్లి తదితర గ్రామంలోని నీటి ఎద్దడి ఉన్న భూములకు సాగునీరు అందించేందుకు జలవనరుల శాఖాధికారులు శ్రమిస్తున్నారు. కాలువల వెంట పర్యటిస్తూ నీటి చౌర్యం జరగకుండా చర్యలు చేపట్టారు. పై గ్రామాల్లోని భూములకు నీరు అందించేందుకు వింజరం వద్ద నీరు కిందకు వెళ్లకుండా లాకులు మూసివేసి నీటి ఎద్దడి ఉన్న పొలాలకు నీరు మళ్లిస్తున్నారు. అయినప్పటికీ గరువు భూములకు నీరు ఇంకా పూర్తి స్థాయిలో అందడం లేదు. దీంతో ఈ ఆయకట్టు భూముల రైతులు మురుగు కాలువ, పంట బోదెల్లో ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని మురుగునీరు పొలాలను తోడుకుంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. దీంతో అదనంగా ఆయిల్ ఖర్చు, ఇంజన్ అద్దె, కూలి ఖర్చులు తడిసి మోపుడు అవుతున్నట్లు రైతులంటున్నారు. మురుగు కాలువ నుంచి ఆయిల్ ఇంజిన్ ద్వారా 13 ఎకరాలు తడపడానికి రూ.60 వేలు ఆయిల్ ఖర్చు అయినట్లు ముదినేపల్లికి చెందిన రైతు కొండ చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో కాలువలకు సాగునీటిని సరఫరా చేసి ఎండిపోతున్న పంట భూములను కాపాడాలంటూ రైతులు కోరుతున్నారు.


ఇంజిన్‌తో పంట బోదె నుంచి పొలాలకు తోడుతున్న నీరు

దాతల సాయంతో రూపుదిద్దుకున్న రుద్రభూమి

నేడు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

గ్రామస్తుల విరాళాలు

రూ.11 లక్షలతో అభివృద్ధి పరుగులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆప్తులను పోగొట్టుకుని దు:ఖంలో ఉంటే ఇంకా అంతిమ సంస్కారాలు ఎలా నిర్వహించాలనే దానిపై కష్టాలు, ఇబ్బందులు పడాల్సి రావడం ఆవేదన కలిగిస్తోంది. మరుభూమిలో కాలు పెట్టేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. శ్మశానవాటికల్లో కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో దృష్టి సారించడంలేదు. గ్రామాల్లో శ్మశానవాటికలు ఆక్రమణలు చిక్కుకుపోవడం పంచాయతీలు పట్టించుకోకపోవడం సమస్యగా మారింది. మానవుడి అంతిమ ప్రస్థానం రుద్రభూమి (శ్మశానం)తో ముగుస్తుంది. మనిషి ఎంత సంపాదించిన కడకు చేరేది అక్కడికే.. అందుకే ఉంగుటూరు మండలం కైకరం తూర్పువీధికి చెందిన దాదాపు 250కిపైగా కుటుంబాల వారు చందాలు వేసుకుని మరభూమిని నిర్మించుకున్నారు.



250 కుటుంబాల సమిష్టి కృషితో శ్మశానవాటిక

తూర్పు వీధిలో 3, 4, 5 వార్డుల్లో అన్ని సామాజిక తరగతులకు చెందిన గృహాలు 265 ఉన్నాయి. ప్రతి ఇంటికి రూ.1116 తక్కువ కాకుండా చందాలు ఇచ్చారు. అవి కాక దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు సైతం కర్మభూమికి భారీ వితరణ అందించారు. ఇంతకుముందుకు రూ.ఎనిమిది లక్షలతో వైసిపిలో ప్రభుత్వం నిర్మించిన బీడు పొయ్యి మాత్రమే ఉండేది. అంత్యక్రియలకు వచ్చే వారికి షెల్టర్, స్నానాలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అస్థికలను భద్రపరిచేందుకు నానా అగచాట్లు ఎదుర్కొవాల్సి వచ్చేది. ఏలూరు కాలువ గట్టు పక్కన ఉన్న ఈ శ్మశానవాటికలో అంత్యక్రియలప్పుడు రేవు లేక స్నానాలు చేసేందుకు ప్రమాదాల బారిన పడేవారు. ఇన్ని సమస్యలను అధిక మించేందుకు దాదాపు రూ.11 లక్షల పైనే వ్యయంతో సర్వాంగ సుందరంగా నిర్మాణాలు పూర్తయ్యాయి.

సంప్రదాయ రీతిలో...

కాలువ రేవును విశ్రాంత ఉద్యోగి కీర్తిశేషులు కొరిపల్లి అప్పారావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ముత్యాలరావు, శ్రీనివాసరావులు రూ.70 వేలతో నిర్మించారు. చిత్తా వీర్రాజు కటుంబ సభ్యులు సహకారంతో కాటికాపరి విగ్రహం, సత్యహరిశ్చంద్రుడు విగ్రహాలు, కొత్తపల్లి సూరిబాబు, సుంకర శ్రీనివాసులు రూ.38 వేలతో శివుని విగ్రహాలు నెలకొల్పారు. శ్మశాన వాటికలో బావి తవ్వకానికి యండ రామదాసు, కంచరపు లక్ష్మీ వరప్రసాద్ రూ.33 వేలు వితరణ చేశారు. రుద్రభూమి ముఖద్వారాన్ని కూన సన్యాసిరావు, ప్రభావతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.55,555, శవపేటిక (ఫ్రీజర్) ఎన్ఆర్ఐ (అమెరికా) సంపతి సతీష్‌కుమార్ రూ.లక్ష ఇచ్చారు. విశ్రాంతి షెడ్డును గ్రామస్తులు నిర్మించారు. స్టీల్ పాడెను బహెూరోతు భాస్కరరావు రూ.15 వేలతో అందించారు.



గ్రామస్తులు, దాతల సాయంతో రూపుదిద్దుకున్న శ్మశానవాటిక

అంతా కమిటీ ఆధ్వర్యంలోనే పనులు

రుద్రభూమి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూన అప్పారావు, గౌరవ అధ్యక్షుడు చిత్తా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లచ్చిరెడ్డి శ్రీనివాసరావు, గౌవర సలహాదారు కొచ్చెర్లకోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సమిష్ఠి సహకారంతో శ్మశానవాటికను సుందరీకరణగా నిర్మించారు.

4న ప్రారంభోత్సవం

ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఈ నెల నాలుగో తేదీన రుద్రభూమిని ప్రారంభించనున్నారు. శ్మశానం వరకు సిమెంటు రోడ్డు నిర్మించేందుకు ఎంఎల్ఎ హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

5న వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వట్సాప్ గవర్నెన్స్ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల ఐదో తేదీన ప్రతి సచివాలయం పరిధిలో అవగాహనా ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నరసింహారావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో ఈ ర్యాలీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 'మన మిత్ర' యాప్ ద్వారా సుమారు 530 రకాల సేవలు, కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువపత్రాలు వంటివి ఇంటి వద్దే సులభంగా పొందొచ్చని తెలిపారు. ఈ వినూత్న విధానం ప్రజల సమయాన్ని ఆదా చేస్తూ, పారదర్శక, వేగవంతమైన సేవలను అందిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

క్వారీలో ప్రమాద ఘటన బాధాకరం

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామంలో ఒక ప్రయివేట్ క్వారీలో జీవనోపాధి కోసం పని చేస్తున్న ఆరుగురు కార్మికులు ప్రమాదవశాత్తు మరణించడం అత్యంత దురదృష్టకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. క్వారీ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదానికి గల కారణాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పలు జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుని తక్షణ సహాయ, సహకారాలు అందిస్తామని, అధైర్య పడొద్దని మంత్రి తెలిపారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆయన ఆదేశించినట్లు తెలిపారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పేరూరులో ఉన్న శ్రీ గంగానమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి మొదటిగా మేళ తాళాలతో, బాజా భజంత్రీలతో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అమ్మ దయతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలన్నారు. పాడి పంటలతో ప్రజలంతా సంతోషంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో, టిడిపి మండలాధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు,వేదపండితులు, స్థానిక ఆలయ కమిటీ పెద్దలు పాల్గొని మంత్రి కొలుసు పార్థసారధిని ఘనంగా సత్కరించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండల పరిధిలోని తుక్కులూరు గ్రామ శివారు దంతుల వారిగూడెం, పోతురెడ్డిపల్లి గ్రామ శివారు మరికుంట గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిపిఐ నూజివీడు నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ అన్నారు. ఆయన ఆదివారం ఆయా గ్రామాల్లో పర్యటించి అక్కడ ఉన్న రైతులు, మహిళలతో మాట్లాడారు. పొలం పనులు చేస్తున్న రైతులంతా కలిసి తమకు కనీస సౌకర్యాలు కావాలంటూ రోడ్డుపై ఆందోళన చేశారు. శివారు గ్రామాల్లో నివసించటమే పాపమా అని ప్రశ్నించారు. నీరు బయటకు వెళ్లే దారి లేక మట్టి రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయన్నారు. పోతురెడ్డిపల్లి, తుక్కులూరు నూజివీడు ప్రాంతాలకు వెళ్లే దారులు సక్రమంగా లేవని ప్రజలు వాపోయారు. వర్షం వస్తే బిక్కుబిక్కుమంటూ ఇళ్లకు పరిమితం కావాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి శివారు గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.